అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ విలీన పంచాయతీ తోటపాలెంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను కమిషనర్ ప్రసాదరావు శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతతో పాటు వేగం పెంచాలని సిబ్బందికి సూచించారు. తోటపాలెం ప్రధాన రహదారిపై గోతులను పూడ్చడం, మురుగునీరు రోడ్డుపైకి రాకుండా ఇరువైపులా కాలువలు లేక అవస్థలు పడుతున్నట్టు స్థానికులు కమిషనర్‌కు వివరించారు. వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. ఆయనతో పాటు పాటు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాదరావు

బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అన్నారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి విజయాన్ని అందుకున్న కూటమి ప్రభుత్వం జిల్లా ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టిందన్నారు. దీనికి వల్ల జిల్లా మరింత వెనక్కి నెట్టబడిందన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. వంశధార, బాహుదా నదులను అనుసంధానం చేసి శివారు ప్రాంతమైన ఇచ్ఛాపురం వరకు సాగునీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. నదుల అనుసంధానంలో భాగంగా నేరడి బ్యారేజీ నిర్మిస్తామని గతంలో చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేదన్నారు. బ్యారేజ్ నిర్మాణానికి రూ.600 కోట్ల అవసరమని అంచనాలు ఉన్నా... బడ్జెట్‌లో ఒక్క రూపాయీ కేటాయించలేదన్నారు. 21 గ్రామాల ప్రజల త్యాగాలతో నిర్మించిన వంశధార రిజర్వాయరు పెద్ద చెరువుగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార రిజర్వాయరు 20 టిఎంసిల నీటితో నింపితే జిల్లాలో 2.50 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లా ప్రజలకు రూ.వెయ్యి నుంచి రూ.1500 కోట్లు ఆదాయం వస్తుందన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబల్ ఇంజన్ సర్కార్ అధికారంలో ఉన్నా... నేరడి బ్యారేజీని ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. మరోవైపు నాగావళి, వంశధార అనుసంధానం ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారన్నారు. గొట్టాబ్యారేజ్ నిర్మించి ఐదు దశాబ్దాలు గడచిందని, ప్రస్తుతం ఈ బ్యారేజీ శిథిలావస్థకు చేరుకుందని గుర్తు చేశారు. నదిలో అత్యధికంగా వరద వస్తే ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదముందన్నారు. ఈ బ్యారేజీకి నష్టం జరిగితే మరో 50 ఏళ్లు వెనక్కి వెళ్లిపోవాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. వంశధార ఆధునికీకరణకు రూ.1500 కోట్లు అవసరమని నిపుణులు చెబుతున్నా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. వంశధార ఆధునికీకరణ వల్ల ప్రస్తుత ఆయకట్టు స్థిరీకరణ, అదనంగా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎడమ కాలువ 104 కిలోమీటర్లు, కుడి కాలువ 73 కిలోమీటర్లు పొడవునా లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.800 కోట్లు అవసరమని నిపుణులు చెపుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అనేక ప్రాంతాల్లో రైతులకు సాగునీరందించేందుకు షట్టర్లు మరమ్మతులు చేపట్టాలన్నారు. వాటి మరమ్మతులకు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. 250 స్ట్రక్చర్ల పునర్నిర్మాణానికి రూ.300 కోట్లు అవసరమన్నారు. పిల్ల కాలువల మరమ్మతులకు రూ.300 కోట్లు కావాలన్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పాత బిల్లులు చెల్లించేందుకు సరిపోతాయని పేర్కొన్నారు. అందువల్ల ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.532 కోట్లు కేటాయించాలన్నారు. బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం అన్యామన్నారు. జీడి రైతాంగాన్ని ఆదుకునేందుకు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు ప్రజల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని నిధులు తీసుకురావాలని సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- తొలి రోజు 685 మంది గైర్హాజరు
- లైవ్ స్ట్రీమింగ్‌లో పర్యవేక్షణ
- పలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కావడంతో ఎక్కువ మంది నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. 75 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు తొలిరోజు 685 మంది గైర్హజరయ్యారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలకు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డివిఇఒ) ఎస్.తవిటినాయుడు ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి (ఆర్ఐఒ) పెద్దపాడులోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ బాలికల రెసిడెన్షియల్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్ష శనివారం ప్రారంభమైంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జనరల్ కేటగిరిలో 21,127 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 20,442 మంది మాత్రమే హాజరయ్యారు. 685 మంది పరీక్షకు హాజరుకాలేదు. పరీక్షా కేంద్రాల్లోకి అర గంట ముందుగానే అనుమతించారు. వేసవి తీవ్రత మొదలు కావడంతో కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. తొలిరోజు తెలుగు1, హిందీ 1, సంస్కృతం 1, ఒడియా 1, జనరల్ ఫౌండేషన్ కోర్సు (ఒకేషనల్) పేపర్లకు పరీక్షలు జరిగాయి.

లైవ్ స్ట్రీమింగ్‌లో పరిశీలన

అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఇంటర్ బోర్డు అధికారులు పరిశీలించారు. శ్రీకాకుళం నగరంలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో పరీక్ష గదులను, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు

పరీక్షా కేంద్రాల ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లను పరిశీలించి కేంద్రాల్లోకి విడిచిపెట్టారు. సెల్‌ఫోన్లు, క్యాలికేటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించలేదు. ప్రాథమిక చికిత్స కోసం అవసరమైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఎస్‌పి సందర్శన

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. అభ్యర్థులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు విధులు నిర్వర్తించాలన్నారు. పరీక్షలు పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి సెల్‌ఫోన్లు స్మార్ట్ వాచెస్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించొద్దని చెప్పారు.పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసిన వరకు తెరవడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అభ్యర్థులు మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి పాల్పడకుండా పరీక్ష నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

రేపు ద్వితీయ సంవత్సరం పరీక్షలు

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి మొదలు కానున్నాయి. పరీక్షలకు 17,567 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- పొందూరు

ఉపాధి హామీ నిధులతో ముమ్మరంగా చేపడుతున్న రోడ్లు, కాలువల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు మండల కేంద్రంలో చేపడుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. సిసి రోడ్లు, కాలువల నిర్మాణ సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై డిఇ చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పిఆర్ సిబ్బంది పర్యవేక్షణ లేకుండా రహదారి నిర్మాణాలు చేపట్టడంతో నాణ్యత లోపిస్తుందన్నారు. రోడ్ల నిర్మాణాలపై క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఎప్పటికప్పుడు నివేదకలు ఇవ్వాలని ఆదేశించారు. పట్టణంలో కాకర్ల నర్సింగ్ హోమ్ నుంచి కనకల వీధివరకు నిర్మించిన సిసి రహదారి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ముందుగా ఎన్‌టిఆర్ సామాజిక పింఛను పంపిణీని పరిశీలించారు. మూగోడి గారి వీధిలో ఉదయం నుంచి పంపిణీ కానీ 9 మంది లబ్ధిదారుల గురించి సంబంధిత సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పింఛను లబ్ధిదారులు ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడంతో పంపిణీ చేయలేకపోయామని సిబ్బంది చెప్పారు. ఆ వెంటనే ఆయా లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. అలాగే వర్క్‌ఫ్రం హోమ్ నిర్వహిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సమాచార సేకరణపై సంబంధిత సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో సుమారు 400 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను గుర్తించినట్లు ఎంపిడిఒ మీసాల మన్మథరావు కలెక్టర్‌కు తెలియజేశారు. వర్క్‌ఫ్రం హోమ్‌కు సంబంధించి రూపొందించిన యాప్‌లో పొందుపరిచిన వివరాలు తెలుసుకున్నారు. ఈయనతో పాటు తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఇఒ మోహన్‌బాబు ఉన్నారు.

గ్యాస్ అదనపు బిల్లుల వసూళ్లపై ఆగ్రహం

మండలకేంద్రంలో ఇండేన్ గ్యాస్ ఏజన్సీ గ్యాస్ వినియోగదారుల నుంచి బిల్లు కంటే రూ.41 అదనపు వసూళ్ల చేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో మూగోడు వీధిలో పలువురు మహిళలు గ్యాస్ డెలివరీ బాయ్స్ అదనపు వసూళ్ల చేస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎంత వసూలు చేస్తున్నట్లు కలెక్టర్ అడిగిన ప్రశ్నకు రూ.870 నుంచి 880 వసూలు చేసున్నట్లు చెప్పారు. గ్యాస్ ధర తెలిసా అని కలెక్టర్ మహిళలను ప్రశ్నించారు. తెలియదని చెప్పడంతో వారి సెల్ ఫోన్‌లో బిల్లుకు సంబంధం చిన మెసేజ్ చూపించారు. రూ.829కు బదులు అదనంగా రూ.41 నుంచి రూ.51 వసూలు చేస్తున్నట్లు గుర్తించి డిఎస్ఒ సూర్య ప్రకాష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే గ్యాస్ ఏజెన్సీని రద్దు చేసి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

డిఎస్ఒ విచారణ

గ్యాస్ ఏజన్సీ అదనపు వసూళ్లపై డిఎస్ఒ జి.సూర్యప్రకాష్ శనివారం విచారణ చేపట్టారు. తమకు 14 ఏళ్లగా ఎటువంటి జీతాలు ఇవ్వడంలే దని, అదనపు వసూళ్లే తమకు ఆదాయమని డెలివరీ బాయ్స్ పేర్కొన్నారు. దీనిపై లేబర్ అధికారులకు ఫిర్యాదు చేయను న్నట్లు తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు తెలిపారు.

పోలీస్ శిక్షణా కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలసలో ఉన్న జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి శనివారం తనిఖీ చేశారు. శిక్షణా కేంద్రంలో మైదానాన్ని, తరగతి గదులు, బ్యారెక్స్, మంచి నీటి సరఫరా, భోజనం, స్నానపు గదులు, ఇతర మౌలిక సదుపాయాలు, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణా కేంద్రంలో ట్రైన్ పోలీస్ కానిస్టేబుళ్లు రానున్నారని, కేంద్రంలో మైదానం, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. శిక్షణ నిమిత్తం అవసరమగు వస్తు సామగ్రి, మౌలిక సదుపాయాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈయనతో పాటు అదనపు ఎస్‌పి కె.వి.రమణ, సిఐ కృష్ణమూర్తి, ఆర్ఐ నర్సింగరావు, పోలీస్ హౌసింగ్ ఎఇ తరుణ, ఎస్ఐ రవికుమార్ ఉన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం



సమీక్షిస్తున్న ఎఎస్‌పిలు

జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులను అదనపు ఎఎస్‌పిలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు ఆదేశించారు. ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కేసులు, మహిళా సంబంధిత నేరాలు, సిసి కెమెరాల ఏర్పాటు, మిస్సింగ్ కేసులు, ఎన్ఫోర్స్‌మెంట్, లోక్ అదాలత్, రోడ్డు ప్రమాదాలు కేసులపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు కోర్టులో హాజరుపర్చాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఫోక్సో కేసుల్లో పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రమాదాలు నివారణకు రోడ్డు భద్రత నియామలపై అవగాహన కల్పించి, ఎక్కువ మొత్తంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద్, డిఎస్ఆర్‌విఎస్‌ఎన్ మూర్తి, వి.అప్పారావు, ఎఒ సిహెచ్.గోపీనాథ్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వేతనజీవుల ఆశలు అడియాశలు

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర బడ్జెట్‌లో వేతనాలు పెరుగుతాయని ఎదురుచూసే వేతన జీవుల ఆశలను ప్రభుత్వం అడియాశలు చేసిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు విమర్శించారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కార్మికుల వేతనాలకు, సమక్షేమానికి తగిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనల్లో తగిన మార్పులు చేయాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రసంగంలో కొన్ని పథకాల అమలు ప్రస్తావన తప్ప, జీతాల కోసం పనిచేస్తున్న కార్మికులకు చోటు కల్పించలేదన్నారు. మానిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మరో వైపు ఆప్కాస్‌ను రద్దు చేసి తిరిగి పాత కాంట్రాక్టు పద్ధతి పునరుద్ధరించడం ఉద్యోగులు, కార్మికులను అభద్రతకు గురిచేస్తుందన్నారు. గతేడాది ఆందోళన చేసిన అంగన్వాడీ, ఆశా, వెలుగు విఒఎ, మధ్యాహ్న భోజన పథకం, సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు, మున్సిపల్ వర్కర్లకు ప్రతిపక్షంలో ఉండగా న్యాయం చేస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఈ బడ్జెట్‌లో జీతాల పెంపు ప్రస్తావన చేయకపోవడం అన్యామన్నారు. తక్కువ జీతాలు తీసుకునే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు సంక్షేమ పథకాల హామీ ప్రస్తావనే లేదన్నారు. అసంఘటిత, ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు హామీ ఏమైందని ప్రశ్నించారు. భవన కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించిన ప్రభుత్వం తిరిగి వాటిని జమ చేసేందుకు కేటాయింపులు ఇవ్వలేదన్నారు.

మెళియాపుట్టి: వేతన జీవులను వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం విస్మరించిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య అన్నారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి జిఒ ఇవ్వకుండానే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీలకు గ్రాట్యూటి అమలు చేసిన ఘనత తమ దేనిని చెప్పుకోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, మండల కళాసీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దారపు దామోదరరావు, నారాయణ, నిరంజన్, వెంకటరావు పాల్గొన్నారు.

పన్నుల భారం తగదు

డిసిసి అధ్యక్షులు కృష్ణారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కూటమి ప్రభుత్వం బడ్జెట్ రెవెన్యూ లోటు చూపించి పన్నుల భారాన్ని మోపేందుకు ప్రయత్నిస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి కృష్ణారావు విమర్శించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో అంకెలు చూపిన ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. అప్పులు, ప్రజలపై పన్నులతో ద్రవ్యలోటును పూడుస్తామని చెప్పడం సరాకాదన్నారు. ప్రధానంగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కేటాయింపులు లేవన్నారు. వ్యవసాయంపై 60 శాతం జనాభా ఆధారపడి ఉన్న రైతులకు అరకొరక నిధులు మాత్రమే కేటాయించారన్నారు. గత ప్రభుత్వం చేస్తున్న తప్పులనే కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులిచ్చి పనులు పూర్తి చేయాలన్నారు.

వేట అడ్డుకుని.. పొట్టకొట్టారు

పెద్దకర్రివానిపాలెం మత్స్యకారుల ఆవేదన

కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెం సమీపంలోని పొగురు (కాలువ)లో ఎన్నో ఏళ్లగా వేటాడుతూ జీవిస్తున్న తమకు పది రోజులుగా ఆ గ్రామానికి చెందిన మత్స్యకారులు వేటాడకుండా అడ్డుకుంటున్నారని, పొగురులో వేటాడేందుకు కుదరదని లేదంటే బోట్లు, తెప్పలు, పడవలు స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారని పెద్దకర్రివానిపాలెంకు చెందిన మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం శాంతియుతంగా నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రవివర్మకు వినతిపత్రాలు అందించారు. అనంతరం మత్స్యకార ప్రతినిధి, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ఇద్దివానిపాలెం సమీపంలోని పొగురులో వేటాడుతున్న తమ గ్రామస్తుల పొట్టకొట్టడం సరికాదని అన్నారు. పది రోజులుగా వేట లేకపోవడంతో గ్రామంలో చాలా కుటుంబాలు పస్తులున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడంతో ఆ గ్రామానికి చెందిన వారు తమను మరింత భయపెడుతున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ తక్షణమే దీనిపై విచారించి న్యాయం చేస్తామని తెలిపారు. ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఇరు గ్రామాలకు చెందిన మత్స్యకారులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. కార్యక్రమంలో కర్రి యువరాజు, చంద్రశేఖర్, దీనబంధు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

బడ్జెట్‌లో గోచరించని వికసిత్ సిక్కోలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం... ప్రతి ఎకరాకూ నీళ్లిచ్చి సస్యశ్యామలం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు వచ్చిన ప్రతి సందర్భంలోనూ చెప్పే మాటలివి. జిల్లాకు చెందిన ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలూ ఎక్కడా తగ్గడం లేదు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమంటూ ప్రకటనలు ఇస్తూనే ఉన్నారు. కూటమి నేతల అభివృద్ధి పలుకులు మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదు. బడ్జెట్‌లో జిల్లాకు జరిపిన కేటాయింపులు పరిశీలిస్తే అదే స్పష్టమవుతుంది. జిల్లాలో గత ఐదేళ్లగా నిధులు కొరతతో సాగునీటి ప్రాజెక్టులు పడకేశాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి తొలి బడ్జెట్‌లో ప్రాజెక్టులకు కాస్తా నిధులు కేటాయింపులు ఉండొచ్చని ఆశించిన వారికి భంగపాటే మిగిలింది. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన వంశధార ఫేజ్-2, స్టేజ్-2, ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు అరకొరగానే నిధుల కేటాయించింది. వంశధార ప్రాజెక్టు స్టేజ్-2, ఫేజ్-2కు సంబంధించి 87, 88 ప్యాకేజీ పనులు, హిరమండలం రిజర్వాయరు, వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనుల కోసం మొత్తం రూ.191.32 కోట్ల కావాలని ప్రతిపాదనలు పంపితే రూ.182.53కోట్లను కేటాయించింది. ఆఫ్‌షోర్ పనులు కోసం రూ.167.68 కోట్ల అవసరమని ప్రతిపాదించినా ప్రభుత్వం మాత్రం 90.60 కోట్లను కేటాయించడం చూస్తే ప్రభుత్వం ఇప్పట్లో రిజర్వాయరును పూర్తి చేయాలన్న ఉద్దేశం కనిపించడం లేదు. ఆఫ్‌షోర్ పూర్తి కావాలంటే రూ.300 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం అందులో మూడో వంతు నిధులను విదిల్చింది. అదీ పనులు, భూసేకరణ బిల్లులు రూ.36 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. చెల్లింపులు పోగా ఇంకా రూ.54 కోట్లే మిగులుతాయి. ఈ స్థాయిలో నిధులు కేటాయిస్తే పనులు ఎప్పుడు పూర్తవుతాయనే ప్రశ్నలు ఉత్పనమవుతున్నాయి. హిరమండలంలోని గొట్టా బ్యారేజీ నిర్వహణకు బడ్జెట్‌లో రూ.వెయ్యి మాత్రమే కేటాయించడం కూటమి ప్రభుత్వానికే చెల్లింది. జిల్లాలో అత్యంత కీలకమైన గొట్టా బ్యారేజీ మరమ్మతులు, ఇతర నిర్వహణ పనులకు అధికారులు రూ.2 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపితే ప్రభుత్వం మాత్రం రూ.వెయ్యి ఇచ్చి చేతులు దులుపుకుంది. బడ్జెట్‌లో ఇతర ప్రాజెక్టుల జోలికి కూడా ప్రభుత్వం వెళ్లలేదు. పైడిగాం, ఓనిగెడ్డ, నారయణపురం ఆధునికీకరణ అంశాలను విస్మరించింది. వర్షాకాలంలో వంశధార, నాగావళికి వచ్చే వరదలు నదీతీర గ్రామాలను ముంచెత్తడం అందరికీ అనుభవపూర్వకమే. వరద ముంపు బారిన పడకుండా చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించే పాలకులు బడ్జెట్ సమయంలో మాత్రం వాటికి నిధులు కేటాయించడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది నవంబరులో జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈదుపురం ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తున్నట్లు సభలో ప్రకటించినా... బడ్జెట్‌లో మాత్రం నిధులు ఇవ్వకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

ఉద్దానం ప్రాంతంలో ప్రధాన పంటలుగా ఉన్న జీడి, కొబ్బరి పంటలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం ఆ పంటల కోసం క్లస్టర్లను ఏర్పాటు ప్రకటనతో సరిపుచ్చింది. కొనుగోలు, గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న తమకు ఇది ఏరకంగా ఉపయోగపడుతుందని రైతులు పెదవి విరుస్తున్నారు. జీడి పిక్కలకు 80 కేజిల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని, ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ రైతులు చాలా ఏళ్లగా ఉద్దానం ప్రాంతంలో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ అంశంపై ఇటీవల పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం కూడా అందించారు. ఎన్నికల ముందు పలాసలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చారు. ఇవేవీ బడ్జెట్‌లో కనిపించలేదు. కేంద్ర ప్రభుత్వం గత నెల ఒకటో తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ సారి మినుములు, కందులు కొనుగోలు చేస్తాంటూ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ బడ్జెట్‌లో జీడి పిక్కలను కొనుగోలు చేస్తామనే ప్రకటనేదీ చేయలేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం జీడి పిక్కలను కొనే ఉద్దేశమేదీ ఉన్నట్లు కనిపించడం లేదు.

జిల్లాలోని గిరిజనులకు, మత్స్యకారులకు ప్రభుత్వం బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడం ఆయా తరగతులను నిరాశకు గురిచేసింది. సంతబొమ్మాళి మండలం భావనపాడు వద్ద ఫిషింగ్ హార్బర్, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద ప్రతిపాదించిన పిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద ప్రతిపాదించిన జెట్టీ నిర్మాణాలకు నిధులు కేటాయించలేదు. ఎన్నికల ప్రచారానికి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో కనీసం దానిపై కనీసం ప్రస్తావించలేదు. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటనల సందర్భంగా ఐటిడిఎ ఏర్పాటు చేస్తామంటూ టిడిపి నేతలు చెప్పడం ఆ తరగతిని మోసం చేయడమే అవుతుంది. ఐటిడిఎ ఏర్పాటుపై అసలు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారో? లేదో అన్న విషయంపై టిడిపి నేతలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరముంది.

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌పై కూటమి పార్టీల నేతలు ఆహా, ఓహో అంటూ కీర్తిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా రైతుల ఆదాయం పెంచకుండా అంతా బాగుందని చెప్పడం వారికే చెల్లింది. సూపర్ సిక్స్ హామీల అమలుపై ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలకు నిరాశే మిగిలింది. బడ్జెట్‌లో రెండు సిక్స్‌ల ప్రస్తావనే కనిపించింది. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం ఈ పథకాలకూ కేటాయించిన నిధులు చూస్తే నిబంధనలు, ఆంక్షల పేరుతో లబ్ధిదారులకు కోత పెట్టేలా ఉందన్న చర్చ సాగుతోంది. బడ్జెట్‌లో ఏ తరగతికి మేలు చేయకుండా 2028-29 నాటికి జిల్లా స్థూల ఉత్పతిని (జిడిడిపి)ని రూ.37,282 కోట్ల నుంచి 81,846 కోట్లకు పెంచుతామంటూ విజన్ డాక్యుమెంట్లు సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. వికసిత్ ఆంధ్రప్రదేశ్, వికసిత్ సిక్కోలు అంటూ గొప్పగా ప్రచారం చేస్తున్న ప్రభుత్వం చేతల్లో మాత్రం ఆ విధమైన చిత్తశుద్ధి లేకపోవడం చూస్తుంటే పాలకులు చెప్తోంది ఒకటి, చేస్తోంది మరొకటని బడ్జెట్ ద్వారా ప్రజలకు అర్థమవుతోంది.

ప్రారంభమైన సచివాలయ భవన నిర్మాణ పనులు

సచివాలయ పనులు ప్రారంభం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు సచివాలయం -2 లావేటిపాలెంలో నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఐదేళ్లుగా పూర్తికాని సచివాలయ భవనం అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వెలువడింది. దీంతో అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒత్తిడి తెచ్చి మరల సచివాలయ భవనం నిర్మాణ పనులు పున: ప్రారంభించారు. శనివారం పునాదులు, బేస్మెంట్ కాంక్రీటు పనులు చేపట్టారు. గత వైసిపి ప్రభుత్వంలో రూ.35 లక్షల నిధులు మంజూరై పనులు ప్రారంభించి పునాదులు స్లేజ్ వరకు వచ్చి అక్కడ నుంచి ఆరేళ్లుగా పనులు నిలిచిపోవడంతో సచివాలయ భవనం లేక అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదైనా పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లారీని బయటకు తీస్తున్న ప్రొక్లెయినర్

దిగబడిన లారీ

రెండు కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్

ప్రజాశక్తి- జి.సిగడాం

చిలకపాలెం - రాజాం ప్రధాన రహదారి దవళపేట కూడలి వద్ద కల్వర్టు మరమ్మతులు చేపడుతుండంతో ఇరువైపులా వచ్చే వాహనాలు మళ్లించేందుకు బిటి రహదారి దిగువ పొలాల నుంచి ఏర్పాటు చేసిన రహదారిలో శనివారం తెల్లవారు జామున భారీ వాహనం కూరుకుపోయింది. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇటు పాలఖండ్యాం అటు పొందూరు వరకు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. నడిచేందుకు వీలులేని పరిస్థితి కనిపించింది. సుమారు ఆరు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఎండలో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఆర్‌అండ్‌బి జెఇ పిటి రాజు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ వై.మధుసూదనరావు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను అదుపు చేసి దిగబడిన లారీని బయటకు తీయించారు. వాహనాలను మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

బూర్జ: బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పిల్లి కన్నన్నాయుడు ఎంపికయ్యారు. అమరావతి కార్యాలయంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జి యలగాల నూకానమ్మ చేతులమీదుగా బాధ్యతలు స్వీకరించారు.

మాట్లాడుతున్న డిపిఒ భారతీసౌజన్య

నీటిఎద్దడి నివారణపై దృష్టి

ప్రజాశక్తి- కవిటి

మండలంలో వేసవిలో నీటిఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు దీనిపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి భారతీసౌజన్య సూచించారు. ఈ మేరకు కవిటి మండలం అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లు శత శాతం సాధించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని రాజపురం, కవిటి, బెజ్జిపుట్టుగ గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను పరిశీలించారు. వీటిని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎంపిడిఒ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీపాణిగ్రాహి, ఇఒ జి.వీరభద్రస్వామి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మా సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని అమలపాడుకు చెందిన బొడ్డు రమేష్ భార్య తులసికి రూ.పది వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. రమేష్ రెండేళ్ల కితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో రెండు కాళ్లు, చేతులు చచ్చుబడ్డాయి. మాటలు కూడా రాకపోవడంతో మంచానికే అంకితమయ్యారు. వైద్య ఖర్చులు కోసం సుమారు రూ.7 లక్షలు పైగా అవసరమవుతాయని వైద్యులు తెలిపారు. రమేష్ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం వీరికి ఇదరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న సమితి సభ్యులు స్పందించి తమ వంతు సహకారం అందించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు చింత మోహనరావు, కర్ని వెంకటరమణ, చింత శ్రీను, బొడ్డు బాబూరావు, బమ్మిడి నవీన్, కొంకి మోహిని, సుంకర రాణి, బొడ్డు రజిని, చింత రోహిణి, చింత దివ్య, బాలక సౌదామని, గనగళ్ల ఉమా తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు గిరిజన సంఘ నేతల వినతి

విజయనగరం: శ్రీకాకుళం జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ శ్రీకాకుళం గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు చౌదరి లక్ష్మీనారాయణ, జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ సభ్యులు గేదెల రమణమూర్తి రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. విజయనగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం వారు చైర్మన్‌ను కలిశారు. జిల్లాల మార్పు తరువాత శ్రీకాకుళం జిల్లాలో ఐటిడిఎ లేని పరిస్థితి ఏర్పడిందని, అందువల్ల గిరిజనుల అభివృద్ధికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అలాగే సారవకోట, మెళియాపుట్టి, టెక్కలి ప్రాంతాల గిరిజనుల సమస్యలను ఈ సందర్భంగా చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు స్పందిస్తూ ఐటిడిఎ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఆమదాలవలస : పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి- ఆమదాలవలస, సరుబుజ్జిలి

ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. సరుబుజ్జిలి, ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల, టిఎస్ఆర్ జూనియర్ కళాశాల, తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసే కొంతమంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు తీసుకొనివచ్చారు. సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో వెంకట సాయి జూనియర్ కళాశాల, రత్న కళాశాల విద్యార్థులతో పాటు, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల చెందిన 183 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 178 మంది పరీక్షలకు హాజరయ్యారు. అలాగే ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు టిఎస్ఆర్ కళాశాలకు చెందిన 308 మంది విద్యార్థులకు 13 మంది హాజరు కాలేదు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కళాశాల ప్రిన్సిపాళ్లు అన్ని ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి.

లావేరు: మండల కేంద్రం లావేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 227 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరెంటెండెంట్ సీమల కృష్ణవేణి తెలిపారు. మొత్తం 231 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు.

రణస్థలం: మండలంలోని ప్రభుత్వ, శాంతినికేతన్, కౌముది జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 8 గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు చేరుకుని, తమ హాల్‌టిక్కెట్ల నెంబర్ల ఆధారంగా తమకు కేటాయించిన గదుల అన్వేషణలో పడ్డారు. తల్లిదండ్రులు కొందరు తమ పిల్లలతో కలిసి వచ్చి పరీక్షా కేంద్రంలో వారికి కేటాయించిన గదుల వెతకడంలో సాయపడటం గమనార్హం. మండలం వ్యాప్తంగా మొత్తం 876 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. పభుత్వ జూనియర్ కళాశాలలో 272 మందికి, 17 మంది, కౌముదిలో 332 మందికి, 18 మంది, శాంతినికేతన్‌లో 272 మందికి, 19 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎం, తాగనీరు, మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. జిరాక్స్ సెంటర్‌ను మూసి వేయించారు. సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

రణస్థలం : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

కవిటి: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 211 మంది విద్యార్థులకు గాను, 203 మంది హాజరయ్యారు. 8మంది గైర్హాజరయ్యారు. కల్యాణి జూనియర్ కళాశాలలో మొత్తం 167 మంది విద్యార్థులకు గాను, 151మంది హాజరయ్యారు. 16 మంది గైర్హాజరయ్యారు.

కోటబొమ్మాళి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 171 మంది విద్యార్థులు పరీక్షాలు రాయాల్సి ఉండగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్, డిఒ రాధకుమారిలు తెలిపారు. విక్టరీ జూనియర్ కళాశాలలో 129 పరీక్షకు హజరుకావాల్సి ఉండగా, నలుగురు హజరు కాలేదని చిఫ్ సూపరెండెంట్ సోమశేఖర్, ప్రభుత్వ అధికారి సనపల రమణమూర్తిలు తెలిపారు.

పోలాకి: పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 190 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, ఎనిమిది మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ హెచ్.పద్మావతి తెలిపారు. పిర్యాగ్రహారంలో 127 మందికి ఐదుగురు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ నాగేంద్ర శర్మ తెలిపారు. ఇందులో ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా డి.వేణుగోపాల్, డి.రామకృష్ణ పర్యవేక్షించారు. ఇన్‌ఛార్జి ఎస్ఐ మహందాత్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమరావతే లక్ష్యంగా బడ్జెట్

సూపర్ సిక్స్ పోస్టర్‌ను చూపిస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి లేదు, సంక్షేమం లేదు. కేవలం అమరావతి అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు బడ్జెట్ ప్రవేశపెట్టారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించిన చంద్రబాబు, రెండో సంవత్సరం కూడా సూపర్ సిక్స్‌లోని ఆడ బిడ్డనిధి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు హామీలను అటకెక్కించారన్నారు. మేనిఫెస్టోలో అమలు చేస్తామన్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు సగం సగం నిధులను మాత్రమే కేటాయించి మొండి చేయి చూపారన్నారు. 50 ఏళ్లకే బిసిలకు పింఛను ఇస్తానన్న చంద్రబాబు ఇప్పుడు ఆ పథకానికి మంగళం పాడారని, ఇప్పటికే తొలగించిన లక్షా 20 వేల పింఛన్లతో పాటు మరో 10 లక్షల సామాజిక పింఛన్ల తొలగింపునకు బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారని, ఇదంతా పేదవారి పొట్ట కొట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల కోసం ఐఆర్, పిఆర్‌సి వంటి విషయాల ప్రస్తావనే బడ్జెట్‌లో లేవన్నారు. అప్పులు చేసి రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి నాశనం చేసి శ్రీలంకగా మారుస్తున్నారని బీరాలు పలికిన చంద్ర బాబు 2025-2026లో లక్షా 4 వేల కోట్లు అప్పులు చేస్తామని బడ్జెట్‌లో పెట్టారని, ఇలా అప్పు చేసిన మొత్తాన్ని రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం కోసం ఉపయోగించకుండా తన రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం అమరావతిలో పెడుతున్నారని మండిపడ్డారు. అమరావతి కోసం రూ.48 వేల కోట్ల టెండర్లు పిలిచారని, దీనిని బట్టి చంద్రబాబు రాష్ట్రాన్ని గాలికి వదిలి, ఒక్క అమరావతి మీదనే దృష్టి పెట్టి తన సంపదను అభివృద్ధి చేసుకుంటున్నారని రవికుమార్ విమర్శించారు.

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం బడ్జెట్ రెవెన్యూ లోటు చూపించి పన్నుల భారాన్ని మోపేందుకు ప్రయత్నిస్తోందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి కృష్ణారావు విమర్శించారు. ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో అంకెలు చూపిన ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రధానంగా పెండింగ్ ప్రాజక్టులను పూర్తి చేసేందుకు కేటాయింపులు లేవని, వ్యవసాయంపై 60 శాతం జనాభా ఆధారపడి ఉన్నా రైతులకు అరకొరక నిధులు మాత్రమే కేటాయించారన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజక్టులకు నిధులిచ్చి పనులు పూర్తి చేయాలన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న హెల్ ఆఫీసర్

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న వ్యాపార సముదాయాలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు పొందాలని మున్సిపల్ హెల్తాఫీసరు డాక్టర్ పి.సుధీర్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రతి వ్యాపారి ఈ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. అలాగే అనుమతి లేని సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లును ఆయన సీజ్ చేశారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ముగిసిన సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సైన్సు ఎక్స్‌పో

నగరంలోని మండల వీధిలో గల రవీంద్రభారతి పాఠశాలలో సైన్స్ ఎక్స్‌పో సంబరాలు వారం రోజులుగా నిర్వహిస్తున్నామని, నేటితో ముగిశాయని రవీంద్రభారతి ప్రిన్సిపాల్ ఘోరక్ చంద్ పల్కు శనివారం తెలిపారు. రవీంద్ర భారతి విద్యాసంస్థలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో సైన్స్ సంబరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థి దశ నుంచే విజ్ఞాన శాస్త్రంలోని మెలకువలను తెలుసుకోవాలని, ప్రతీ విద్యార్థి ఒక గమ్యాన్ని నిర్దేశించుకొని విజయ పరంపర కొనసాగించాలన్నారు. అనంతరం సైన్స్ ఎక్స్పోలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించి విద్యార్థులు తయారుచేసిన నమూనాలను తిలకించారు. కార్యక్రమంలో డీన్ నాగరాజు, డిఐ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులను అణగదొక్కితే ఉద్యమాలే

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఉద్యోగుల సంక్షేమాన్ని మరచిపోయి ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసిందని సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గురుగుబెల్లి భాస్కరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిఎ, ఐఆర్‌ల ఊసే లేదని, కనీసం ఉద్యోగుల సరెండర్ లీవ్స్‌ను నగదుగా మార్చుకోవడానికి ఈ ప్రభుత్వం వచ్చాక అవకాశం కల్పించకపోవడం శోచనీయమని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రకమైన చర్యలు ఉద్యోగులను అనగదొక్కడంలో ఓ భాగమేనని, ఇటువంటి ఉద్యోగ వ్యతిరేక చర్యలతో ఉద్యమాలు పుట్టుకొస్తాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను అమలుకు భరోసా ఇవ్వాలని కోరారు.

'నాడు-నేడు' పనుల రికార్డులు పరిశీలన

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు-నేడు పనుల రికార్డులను ఎపిఇడబ్ల్యూడిఒ డిఇఇ కె.రాములు, ఎఇ సాయికిరణ్ శనివారం తనిఖీ చేశారు. గత పాఠశాల కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో చేపట్టిన నాడు-నేడు పనులకు సంబంధించి పనుల్లో జరిగిన అవినీతి, చేపట్టిన పనులకు సంబంధించి నేటికీ బిల్లులు చెల్లించక పోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పట్లో చేపట్టిన పనులకు సంబంధించి తీర్మాణాలు, ఖర్చులు, బ్యాంకు చెక్కులు, తదితర దస్త్రాలను పరిశీలించారు. తీర్మాణాలపై పాఠశాల కమిటీ చైర్మన్ హేమలత సంతకాలలో వ్యత్యానం, జరిగిన పనుల్లో లోపాలను గుర్తించారు. ఈ పనుల్లో పలు అంశాలను పరిశీలించి నివేదికలను ఉన్నత అధికారులకు సమర్పిస్తామని తెలిపారు.

రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

'పది' పరీక్షలు సజావుగా నిర్వహించాలి

జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య

మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

టెక్కలి: ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని డిఇఒ సదాశివుని తిరుమల చైతన్య సూచించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు తాగునీటిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్దా ఆరోగ్య సిబ్బంది ఉండాలన్నారు. పరీక్షల నిర్వహణలో సిబ్బంది కఠిన తరంగా వ్యవహరించాలన్నారు. డివిజన్ స్థాయిలోని 9 మండలాల పరిధిలో 34 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ తెలిపారు. 6,419 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. సమావేశంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, సిబ్బంది డేవిడ్, కుప్పిలి ప్రకాష్ పాల్గొన్నారు.

పాఠశాలను విలీనం చేయొద్దు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని కొల్లూరు పంచాయతీ సిర్తలి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను ఎం.ఎస్.పల్లి ఉన్నత పాఠశాలలో విలీనం చేయొద్దంటూ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు ఎంఇఒ శివరాం ప్రసాద్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామసుత్లఉ మాట్లాడుతూ తమ గ్రామస్తులమంతా ఒకే మాటకు కట్టుబడి ఏళ్ల తరబడి తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నామన్నారు. ప్రస్తుతం అధికారులు మూడు, నాలుగు, ఐదు తరగతులకు చెందిన విద్యార్థులను ఎం.ఎస్.పల్లి ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని, దీనివల్ల తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తమ గ్రామం నుంచి ఎం.ఎస్.పల్లి వెళ్లే రహదారి ఒడిశా సరిహద్దు గ్రామం కావడంతో నిత్యం వాహనాల రాకపోకలు రద్దీగా ఉంటాయన్నారు. అధికారులు స్పందించి తమ గ్రామంలోని విద్యార్థులు చదువుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ పైల దాలయ రెడ్డి, గ్రామ పెద్దలు పైల మాదయ్య, మద్ది ఢిల్లీరావు, తమ్మయ్య, పైల పాపయ్య, మద్ది ఈశ్వరరావు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం యూత్ ప్రధాన కార్యదర్శిగా సురేష్ కుమార్

నియామకపు పత్రాన్ని స్వీకరిస్తున్న సురేష్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: నాలుగు దశాబ్దాలుగా బిసిల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఆర్. కృష్ణయ్య నేతృత్వాన నడుస్తున్న బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధానకార్యదర్శిగా కూటికుప్పల సురేష్ కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు అమరావతిలో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో మహిళా అధ్యక్షులు యలగాల నూకానమ్మ చేతులమీదుగా నియామకపు పత్రాన్ని అందజేశారు. అనంతరం సురేష్ కుమార్ మాట్లాడుతూ నిరంతరం బిసిల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తానన్నారు. చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్ల అమలుకు బిసి సంక్షేమ సంఘం కృషి చేస్తోందన్నారు. రాజ్యాధికారం దక్కాలంటే రిజర్వేషన్లు తప్పక సాధించుకోవాలన్నారు. యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులపై షార్ట్ ఫిలిం

పలాస: మండలంలోని రెంటికోట గ్రామ పరిధిలో రోడ్డు ప్రమాదానికి గురయ్యే వారిని ఎలా ఆదుకోవాలని అవగాహన కోసం ఒక షార్ట్ ఫిలిం పలాస వాసి పేజ్, గ్రీన్ ఆర్మీ వారి సంయుక్తంగా చిత్రీకరించారు. జి.కె.ప్రసాద్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం సంభవించే సమయంలో ఆస్పత్రికి చేరే బాధితులు 60 నిమిషాల్లో చేరినట్లయితే దీన్ని గోల్డెన్ అవర్ అని అంటారు. బాధితున్ని సురక్షంగా తీసుకొచ్చినట్లయితే ట్రీట్మెంట్ ఇచేందుకు అనుకూలంగా ఉండి ప్రాణాలు కాపాడవచ్చు అని అన్నారు. పలాస వాసి దిలీప్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుడ్ సమర్థన్ యాక్టు ప్రకారం రోడ్డు ప్రమాదం గురయ్యే వ్యక్తిని కాపాడే సమయంలో బహుమతి అందించడం, ఏ విధమైన పోలీస్ కేసు కానీ ఉండదని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ షార్ట్ ఫిలింలో తేజ, ప్రభావతి రెంటికోట యువకులు నటించారు.

షార్ట్ ఫిలింను చిత్రీకరిస్తున్న దర్శకులు

శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీలో పాల్గొన్న అంగన్వాడీలు

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాలికలకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా తక్షణమే తల్లిదండ్రులకు తెలియ జేయాలని ఐసిడిఎస్ గూనపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ బి.యోగీశ్వరమ్మ తెలిపారు. నగరంలోని గూనపాలెం సెక్టార్ కార్యాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కిశోర బాలికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలికలు వ్యక్తిగత శుభ్రత అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె.కళ్యాణి, టి.రాజేశ్వరి, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఎటువంటి సమస్యలు వచ్చినా పిల్లలు తల్లి దండ్రులతో చెప్పుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వై.జారు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ మహిళ కళాశాల ఆవరణలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. బి.సుజాత, ఎస్.నీలవేణి పాల్గొన్నారు.

పొందూరు : అంగన్వాడీల సెక్టార్ మీటింగ్‌ను సూపర్‌వైజర్ కె.లీలారాణి నిర్వహించారు. మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే సైకిల్ ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో పొందూరు, లోలుగు సెక్టార్ల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పాపారావు మృతదేహం

ప్రజాశక్తి- పలాస

జాతీయ రహదారి మొగిలిపాడు సమీపంలో శనివారం లారీ ఢీకొని ద్విచక్ర వాహన దారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మందస మండలం అంబుగాంకు చెందిన బళ్ల పాపారావు (36) టెక్కలి వ్యక్తిగత పనులు నిమిత్తం వచ్చాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి బైక్ వెళ్తున్నాడు. మొగిలిపాడు వద్ద వెనుక నుంచి లారీ ఢీకొంది. వాహనదారుడు హెల్మెట్ ధరించినా దానిపై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. మార్గం మధ్యలో పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. సిఐ పి.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

పలాస : తన పెద్ద కుమార్తె జంగం రాధ శుక్రవారం నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి కమల కాశీబుగ్గ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. వివాహం తరువాత రాధ భర్త మృతి చెందడంతో ఇద్దరు పిల్లలతో పద్మనాభపురం ఎఫ్‌సి గోదాంలో పనిచేస్తుందన్నారు. ఈ క్రమంలో ఇంటి నుంచి ఉదయం 8.30 గంటలకు పనికి వెళ్లి తిరిగిరాలేదన్నారు. రాత్రి ఏడు గంటల వరకూ వేచి చూశామని, ఎంతకీ రాకపోవడంతో చుట్టపక్కల, బంధువుల ఇళ్లలో వెతికామని తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నీలం-పింక్ రంగు చీర ధరించిందని అన్నారు. కమల ఫిర్యాదు మేరకు సిఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

6న 'చలో విజయవాడ'

కొత్తూరు : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16న చలో విజయవాడ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ నియకులు పి.జయలక్ష్మి, కె.జ్యోత్స్న, ఎస్.గౌరమ్మ, కె.పూర్ణిమ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆశా వర్కర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని ఉద్యోగం భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఆశా వర్కర్ల యూనియన్ నాయకులతో కుదుర్చుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎస్.అప్పలమ్మ, క్రాంతికుమారి, లక్ష్మి, సుశీలమ్మ, రెయ్యమ్మ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- అరసవల్లి

నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో 1968-69 సంవత్సరం బ్యాచ్ 12వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. గతంలో నాలుగు సార్లు ఆత్మీయ కలయిక నిర్వహించామని, నేడు ఐదవ ఆత్మీయ కలియక జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఖ్యాతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ.15 వేలు విలువ చేసే రైస్‌కుక్కర్, వాటర్ డిస్పెన్సర్ వితరణ చేశారు. బ్యాచ్ విద్యార్థులైన సేనాపతి రమణారావు వెట్ గ్రైండర్, జె.శ్యామసుందరరావు దుస్తులు, దుప్పట్లు వేర్వేరుగా వృద్ధాశ్రమానికి బహూకరించారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు శ్రావణి ధన్యవాదాలు తెలిపారు. సమావేశానికి ముందుగా ఇటీవల కాలంలో మృతి చెందిన మావూరు హైమావతి, గణేశ్వరరావు పట్నాయక్, పట్నాల చంద్రమౌళీశ్వరరావు, ఎఎన్‌వి లక్ష్మణరావు, చెంగల్వరావు, ఎన్‌టిఆర్ హెచ్‌ఎం, ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు వి.జి.కె. మూర్తిలకు నివాళ్లర్పిస్తు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కన్వీనర్ మండ ప్రభాకరరావు, జెఎస్ఎస్ ప్రకాశరావు, వండాన చంద్రశేఖరరావు, ఎం.సీతారామమూర్తి, డా సంపత్ కుమార్, శేష గిరిబాబు, రామకోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, బి.నాగరాజు తదితరులున్నారు.

చెక్కును అందజేస్తున్న రామారావు

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పెద్దశ్రీరాంపురం పంచాయతీ చిన్నశ్రీరాంపురానికి చెందిన మార్పు కమల అనారోగ్యంతో బాధపడుతుంది. ఈమెకు పరిస్థితిని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు దృష్టికి తీసుకెళ్లారు. వైద్య ఖర్చుల కోసం సిఎం సహాయ నిధి నుంచి రూ.25 వేలు మంజూరు కావడంతో టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ మాదిన రామారావు శనివారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్యనారాయణ, సతీష్, ప్రదీప్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

బూర్జ : మండలంలోని అన్నంపేట పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ పరిడాల పుణ్యవతి ఇటీవల మృతిచెందడంతో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం పుణ్యవతి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే వైసిపి మండల అధ్యక్షుడు కండాపు గోవిందరావు అత్తగారు అమ్మాజమ్మ మృతి చెందడంతో గోవిందరావు కుటుంబాన్ని, తోటవాడకు చెందిన సిరిపోతు రాజు సతీమణి మృతిచెందడంతో రాజు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనతో పాటు మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు సేపేన రమేష్, బొత్స సురేష్, అన్నంపేట జనసేన నాయకులు కుప్పిలి చంటి, సోమరాజు పవన్, గుంటు బోయిన తిరుపతి, కృష్ణ, కూరాకుల పొలిరాజు, గుంటుబోయిన శివ, టిడిపి నాయకులు సైలాడ దుర్గారావు తదితరులున్నారు.

గోవిందరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జయరాం

టీకాలతో వ్యాధులు దూరం

రాష్ట్ర పురోగాభివృద్ధి బడ్జెట్

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పురోగాభివృద్ధి సాధిస్తుందని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల జీవనస్థితిగతులు మారుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విజన్ 2047 ప్రవేశపెడుతూ దేశంలో రాష్ట్రం ప్రథమంగా ఉంచేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరుకు గతేడాది రూ.30 కోట్లు, ప్రస్తుత బడ్జెట్ రూ.90 కోట్లు ప్రకటించి జిల్లాపై ప్రేమ కనపరిచారన్నారు. విద్య, ఆరోగ్యం, తాగునీరు, సాగునీరుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు తలగాన శంకర్, ప్రసాద్, గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

కృష్ణచంద్ సేవలు ప్రశంసనీయం

శ్రీకాకుళం అర్బన్ : సీనియర్ న్యాయవాది, జిల్లా ఫ్యామిలీ, ఫోక్సోకోర్టుల మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణ చంద్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. నగరంలోని ప్రైవేటు హోటల్‌లో ఆయనను ఘనంగా సత్కరించారు. ఏకకాలంలో ఎనిమిది కోర్టుల్లో పిపిగా సేవలందించిన ఆయన తన పదవీ కాలాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేశారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిలారు ఈశ్వరరావు, న్యాయవాదులు మామిడి క్రాంతి, శాసపు జోగినాయుడు, కొమరావు ఆఫీసు నాయుడు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు డా.ఎన్ని సూర్యారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని బొరివంక 11 కెవి ఫీడర్ లో విద్యుత్ స్తంభాలు మార్పు కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొరివంక, బెజ్జిపుట్టుగ, బొగిడిపుట్టుగ, దుగాన పుట్టుగ, తుంగానపుట్టుగ గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

మూడు చక్రాల కుర్చీ వితరణ

శ్రీకాకుళం అర్బన్: దీర్ఘకాలికంగా టిబి వ్యాధితో బాధపడుతున్న వికలాంగుడు ఎలుకుల అప్పలనాయుడికి మూడు చక్రాల కుర్చీని పెదపాడుకు చెందిన బొట్టా సాయికుమార్ ఆర్థికసాయంతో జెమ్స్ వైద్యకళాశాల వైద్యులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ అందజేశారు. శనివారం వైద్య కళాశాలలో ఉన్న అప్పలనాయుడికి కుర్చీని అందజేశారు. రెండు కాళ్లు చచ్చుబడి నడవలేని పరిస్థితి ఉందని, గతంలో తాపీపని చేసుకుంటూ జీవనం కొనసాగించే వారన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్.హేమంత్, డాక్టర్ బి.జ్యోత్స్న, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జామి జాతరకు ఆహ్వానం

పలాస : పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధి 23వ వార్డులోని ఎల్లమ్మ తల్లి జాతర ఈ నెల 8న నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కమిషనర్ రామారావును శనివారం కలిసి ఆహ్వానించారు. ఈ జాతరకు చుట్టుపక్కల మండలాల పరిధిలోని ప్రజలు తరలి వస్తారని వివరించారు. జాతర ప్రదేశంలో తాగునీటి సరఫరా, విద్యుత్ అలంకరణ, శానిటేషన్, ఇతర సదుపాయములు కల్పించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ పురపాలక సంఘం తరపున అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

పొందూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని వాటి సాధనకు కృషి చేయాలని హెచ్‌ఎం కాసులు బాబు అన్నారు. మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు సినీగీతాలకు నృత్యాలు చేసి అలరించారు. అలాగే పలువురు ఉపాధ్యాయులకు విద్యార్థులు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- కవిటి

పశువులకు వేసే టీకాల ద్వారా వాటిని చాలావ్యాధుల నుంచి రక్షించవచ్చని కవిటి ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని జాలారిపాలెం, పుక్కళ్లపాలెం గ్రామాల్లో పశువులకు శనివారం గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. 200 మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో నెలరోజుల పాటు నిర్వహించే ఈ టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రభుత్వ పశువులకు ఉచితంగా అందజేస్తున్న గాలికుంటువ్యాధి నివారణ టీకాలను పాడి రైతులు పశువులకు తప్పనసరిగా వేయించుకోవాలని పశు వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మాడ, చౌదరికొత్తూరు, తిలారు, కొత్తపల్లి గ్రామాల్లో సామూహిక గాలికుంటు వ్యాధి టీకాలను కోటబొమ్మాళి సహాయ సంచాలకులు డాక్టర్ ఎం. లోకనాథం ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో తిలారు పశువైద్యాధికారి ఎం.ప్రజ్ఞచైతన్య, కె.ముకుంద రావు, జ్యోతికుమారి, కె.పద్మ, రామకృష్ణ, ధనుంజయ, శ్రీకర్ పాల్గొన్నారు.

కవిటి : టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి కిరణ్‌కుమార్

ఆమదాలవలస: మండలంలో గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా పాడి పశువులకు వేయబడునని పశు సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు తెలిపారు. శనివారం పురపాలక సంఘం పరిధిలోని కుదిరాంలో పశువులకు టీకాలను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 1 నుంచి 30 వరకు మండల వ్యాప్తంగా టీకాల కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు. ప్రతీ రోజు మూడు బృందాలు గ్రామాల్లో టీకాలు వేయడం జరుగు తుందన్నారు. ఈ టీకాలపై పాడి రైతులకు అవగాహన కల్పించామని వ్యాక్సిన్లు కూడా ఆయా కేంద్రాలకు చేర్చామని చెప్పారు. పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న రీజనల్ హెడ్ వెంకట తిలక్

5న ఎంఎస్ఎంఇ రుణమేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎంఎస్ఎంఇ రుణాలకు సంబంధించి ఈనెల 5న అంబేద్కర్ ఆడిటోరియంలో రుణమేళాను నిర్వహించనున్నట్టు యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎం.వెంకట్ తిలక్ తెలిపారు. నగరంలోని వెంకటాపురంలో ఉన్న యూనియన్ బ్యాంకులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలో 59 బ్రాంచ్‌లు ఉన్నాయని, శ్రీకాకుళం జిల్లాలో 43 బ్రాంచ్‌లు, పార్వతీపురం జిల్లాలో 16 బ్రాంచ్‌లు ఉన్నాయని వివరించారు. వీటి పరిధిలో రూ. ఎనిమిది వేల కోట్ల మేర బిజినెస్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డిపాజిట్ల రూపంలో రూ.3,200 కోట్లు, రుణాల రూపంలో రూ.4,800 కోట్లు మేర లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. తమ బ్యాంకుల ద్వారా ఎంఎస్ఎంఇల రూపంలో గృహ, రిటైల్, విద్య, గోల్డ్, వ్యవసాయ తదితర రుణాలన్నీ అందజేస్తామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 7 వరకు దేశంలోని అన్ని బ్రాంచ్‌ల్లో ఎంఎస్ ఎంఇ రుణమేళా నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈనెల 5న నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో రుణమేళా నిర్వహిస్తున్నామని, దీనిని జిల్లా ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు ముంబాయిలోని యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి జిఎం పి. శ్రీనివాస్ హాజరవుతారన్నారు. రుణమేళాకు వచ్చి రుణాలు అవసరమైన వారికి ధ్రువపత్రాలను పరిశీలించి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ రుణమేళాను వినియోగించుకొని అందరూ వ్యాపారం ప్రారంభించి అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ పి.రవి పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలం పాటు తెలుగు రాష్ట్రాల్లో ఎస్‌సి ఉప కులాల హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఎంఆర్‌పిఎస్ ఉద్యమంలో అమరులైన పలువురు నాయకులకు ఘనంగా నివాళ్లర్పించారు. శనివారం నగరంలోని పాత శ్రీకాకుళం హరిజన వీధి కమ్యూనిటీ హాల్‌లో మాదిగ అమరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీసభ్యుడు దాసరి తిరుమలరావు మాదిగ హాజరై మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ లక్ష్య సాధన కోసం ఎంతో మంది త్యాగాలు చేశారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగా నేటి ఉద్యమం మంచి ఫలితాలను అందుకోనుందన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు మాదిగ, మన్యం జిల్లా ఇన్‌ఛార్జి బోస్ మన్మధరావు మాదిగ, ఉమ్మడి జిల్లాల మాజీ అధ్యక్షులు లోపింటి కృష్ణ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి కానుకుర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

దరఖాస్తులు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఆమదాలవలస రూరల్, అర్బన్, సరుబుజ్జిలి, బూర్జ మండలాల ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, రోడ్లు, కాలువలు వంటి సమస్యలపై సుమారు 100కుపైగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెడుతుందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, మండల అధ్యక్షులు నూక రాజు, అంబళ్ల రాంబాబు, వావిలపల్లి రాంజీ, పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రభూషణరావు చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం పరామర్శించారు. జడూరుకు చెందిన గొండు చంద్ర భూషణరావు అనారోగ్యంతో మృతి చెందంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జిల్లేడువలసకు చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు దుంగ సుందరమ్మ మృతి చెందడంతో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి గొండు మురళి, టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, బైరి భాస్కరరావు పాల్గొన్నారు.

నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణ ఇచ్చిన మాట ప్రకారం ఆదరణ త్రీ పథకం కింద రూ.వెయ్యి కోట్లు బడ్జెట్లో కేటాయించడం అభినందనీయమని ఆ సంఘ నాయకులు సిహెచ్.కనకరాజు అన్నారు. స్థానిక నాయీబ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుల చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, వీరస్వామి, పోతల రామదాసు, అప్పారావు, తెలగవలస మోహనరావు, వెంకటేష్, బొమ్మాళి కృష్ణారావు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్ష 430వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా శనివారం దీక్షలో రత్తకన్న గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వీరు మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అంగన్వాడీ సహాయకులకు మెమో

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని రొట్టవలస కూనజమ్మన్నపేట అంగన్వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సహాయకులకు నోటీసులు జారీ చేశామని బూర్జ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ గీత తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కూనజమ్మన్న పేట, రొట్టవలస అంగన్వాడీ కేంద్రం-2లో విధులు నిర్వహిస్తున్న సహాయకులకు మెమో జారీ చేసినట్టు ఆమె తెలిపారు. మూడు రోజుల్లో మెమోపై స్పష్టమైన సమాధానాలు వారి నుంచి రాని యెడల జిల్లా అధికారులకు తదుపరి చర్యలు నిమిత్తం నివేదించడం జరుగుతుందని పిఒ తెలిపారు.